క్లుప్తంగా

అమర గాయకుడు ఘంటసాల

కడియం: ఘంటసాల అమర గాయకుడని పలువురు పేర్కొన్నారు. వేమగిరిలో ఘంటశాల వీరాభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఆయన జయంతిని పురస్కరించుకుని ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆటో యూనియన్ సభ్యులు, మర్రి సుబ్రహ్మణ్యం, బొర్రా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు సాయం

కడియం: భర్త మృతితో పాటు ఇల్లు కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్న కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన డి.సత్యవతికి ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు బుధవారం సాయం అందజేశారు. ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో నగదు, బియ్యం బస్తా, కిరాణా సరకులు, కూరగాయలు, దుస్తులు తదితరాలు అందజేశారు. కార్యక్రమంలో కె.నాని, రాము, శ్రీను, వాసు, నాగార్జున, సచిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తీగిరెడ్డి శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: వడిశలేరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కవలగొయ్యి గ్రామానికి చెందిన తీగిరెడ్డి శివ, సాన్వి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. తీగిరెడ్డి శివ వైఎస్సార్ సీపీ నాయకులు తీగిరెడ్డి శ్రీనివాస్ అన్న కుమారుడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను, అతని కుటుంబ సభ్యులను వేణు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మద్దిల రమణ, పల్లేటి చిన్న, చంటి, రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



నర్సరీ అసోసియేషన్ కార్యాలయం రోడ్డులో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయం రోడ్డులో విద్యుత్ తీగలు తెగిపోయి కిందకు వేలాడుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా మొక్కల లోడుతో భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఏ వాహనానికైనా తీగలు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు ఈలి గోపాలం తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

కడియం: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పరికరాలను యాభై శాతం రాయితీపై అందిస్తున్నాయని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలీ హౌస్, పవర్ స్ప్రేయర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, వీడ్‌మేట్‌లకు రాయితీలను అందిస్తోందన్నారు.

ఆసుపత్రికి అధునాతన పరికరాలు



వైద్య సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆంధ్ర పేపర్ మిల్స్ సౌజన్యంతో అత్యాధునిక వైద్య యంత్ర పరికరాలు అందజేశారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆంధ్ర పేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్ జైన్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి ఈ వైద్య పరికరాలు అందజేశారు. సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో చిలకలూరి చెరువు పార్క్ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని వారన్నారు. ఆంధ్రా పేపర్ మిల్లు సీఎస్ఆర్ నిధులు రూ.68,56,829తో వివిధ వైద్య పరికరాలు కొనుగోలు చేశారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ, పేపర్‌మిల్ ప్రతినిధులు శుక్లా, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్తం వెన్నుపోటు



వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి గణేష్, చందన నాగేశ్వర్ తదితరులు

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ
- వెన్నుపోటు దినం కార్యక్రమంలో భారీ బైక్ ర్యాలీ



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి గణేష్, చందన నాగేశ్వర్



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలు నమ్మి ఓటేసినందుకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, తొలి ఏడాదిలో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో బొమ్మూరులోని పార్టీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి చెల్లుబోయిన వేణు, జక్కంపూడి గణేష్, చందన నాగేశ్వర్ తదితరులు కూటమి ప్రభుత్వ హామీల అమలుపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే తొలి ఏడాదిలోనే 99 శాతం హామీలు అమలు చేశాన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితి వచ్చినప్పటికీ సంక్షేమాన్ని ఎక్కడా ఆపలేదన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు వైఎస్ జగన్ పెద్దపీట వేశారని అన్నారు. చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం అయ్యాయన్నారు. తొలి ఏడాదిలోనే రికార్డు స్థాయిలో రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. ఏడాదిలోనే రైతులను సంక్షోభంలోకి నెట్టేశారని, ఆడబిడ్డలు, నిరుద్యోగ యువతను సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ తెచ్చిన సంక్షేమ పథకాలను సైతం ఎత్తేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు వెన్నుపోటుకు గురయ్యారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు నిర్వహించి కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేసే వరకూ వైఎస్సార్ సీపీ ప్రజలకు అండగా ఉండి పోరాడుతుందని వేణుగోపాలకృష్ణ అన్నారు.

ప్రతి హామీ అమలు చేయాలి: జక్కంపూడి గణేష్

ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా యువతకు నిరుద్యోగ భృతి అని, రైతులకు అన్నదాత సుఖీభవ అందిస్తామని, ఇప్పటి వరకూ అమలు చేయకుండా మోసం చేశారన్నారు. నిజంగా ఏడాది కాలంలో ఎన్నికల హామీలను నెరవేర్చకుండా పండుగలను చేసుకోవడం వారి వైఖరికి సిగ్గుపడాలన్నారు. ఐదేళ్ల పాటు వైఎస్సార్ సీపీ తరఫున ప్రజలకు అండగా నిలబడతామని జక్కంపూడి గణేష్ స్పష్టం చేశారు.

అవస్థలే సమస్తం: చందన నాగేశ్వర్

కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు అవస్థలే మిగిలాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. గత వైఎస్ జగన్ పాలనలో అమలు చేసిన వలంటీర్, ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలను తొలగించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను చేయడని అందరికీ తెలిసిందేనన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు సూపర్‌వెక్స్ అయ్యారన్నారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, కడియం మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర, జిల్లాల, నియోజకవర్గ వివిధ విభాగాల పార్టీ ప్రతినిధులు తాడాల విష్ణుచక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, బడుగు చిన్ని, మింది నాగేంద్ర, చీకురుమిల్లి చిన్న, వెలుగుబంటి అచ్యుతరామ్, పెయ్యల రాజేష్, యెజ్జువాసు, ఆచంట కళ్యాణ్, పడాల వీరరాఘవరెడ్డి, బొప్పన సుబ్బారావు, రెవ.విజయసారథి, బత్తిన అప్పారావు, యెనుముల త్యాగరాజు, ముద్దాల అను, నందెపు శ్రీనివాస్, ఎన్వీ శ్రీనివాస్, నరవ గోపాలకృష్ణ, సాపిరెడ్డి సూరిబాబు, చింతపర్తి రాంబాబు, రాజమౌళి, ఉప్పులూరి రాము, కొండపల్లి పట్టియ్య, డాక్టర్ సత్యగిరి, ఎంఎం ఆలీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, పార్లమెంట్ పరిశీలకుడు గురుమూర్తిరెడ్డి

ప్రజలు సూపర్‌వెక్స్

- హామీలు అమలు చేయని కూటమి సర్కారు
- మాజీ ఎంపీ భరత్‌రామ్ విమర్శ

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నో హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం ఒక్కటీ అమలు చేయకపోవడంతో ప్రజలు సూపర్‌వెక్స్ అయ్యారని, అందుకే ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నిలిచి రాజమహేంద్రవరంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. దీనికి నిరసనగా నగరంలోని జాంపేట, అజాద్ చౌక్, జెండా పంజా రోడ్, సూర్య హోటల్, సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకూ ర్యాలీ నిర్వహించారు. నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతబట్టి, నల్ల బెలూన్లు, కండువాలు ధరించి వైఎస్సార్ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులతో కలసి మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు సరికదా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను అష్టకష్టాలు పెడుతున్నారని, మరోపక్క వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చేస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. కూటమి పాలన వచ్చాక రాష్ట్రంలో సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు లక్షా 60 వేల కోట్ల అప్పు చేసి, రాష్ట్రాన్ని అప్పులమయం చేశారన్నారు. రాష్ట్రంలో ధాన్యం, మిర్చి, పత్తి, ఆక్వా, పొగాకు రైతులకు సాయం అందలేదన్నారు. ఏ రైతుకి మద్దతు ధర రావడం లేదన్నారు. రైతులకు సబ్సిడీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు.

సీజ్ చేయడం దారుణం

నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వలేదని మాజీ ఎంపీ భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ హామీలు అమలు చేయకపోవడంతో శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే, కార్యకర్తల నుంచి నల్ల బెలూన్లు, కండువాలు, ఫ్లెక్సీలను పోలీసులు లాక్కోవడం, డీజే వాహనాన్ని సీజ్ చేయడం దారుణమన్నారు. ఎప్పుడూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉండదన్న విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. రేపు రాబోయేది తమ ప్రభుత్వమేనని, అది ప్రజా ప్రభుత్వమని తెలుసుకోవాలన్నారు. వలంటీర్లకు రూ.పది వేలు ఇస్తామని ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ చెప్పారని, అయితే ఎన్నికలయ్యాక వలంటీర్లను తీసివేశారన్నారు. రేషన్ నేరుగా ఇంటికి అందించే ఎండీయూ ఆపరేటర్లను తొలగించి, మళ్లీ షాపుల దగ్గరకు రమ్మనడం దారుణమన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ఒప్పందం ఇంకా రెండేళ్ల వరకు ఉన్నప్పటికీ తొలగించడం సరికాదన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, రేపొద్దున పవన్ కళ్యాణ్‌కూ అదే అవుతుందని భరత్‌రామ్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మార్తి లక్ష్మి, గుత్తుల మురళీధర్, రావిపాటి రామచంద్రరావు, కానుబోయిన సాగర్, సంకిస భవానీప్రియ, గుర్రం గౌతమ్, మజ్జి నూకరత్నం, కాటం రజనీకాంత్, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు, దాసి వెంకట్రావు, ముప్పన ప్రభాకర్, బర్రే కొండబాబు, పీతా రామకృష్ణ, బిల్డర్ చిన్నా, ఆరే చిన్ని తదితరులు పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఆర్డీఓ కృష్ణనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, పార్లమెంట్ పరిశీలకుడు గురుమూర్తిరెడ్డి

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నగరంలో రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్ పట్ల అవమానకరంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి హిందూ రాజ్యాంగాన్ని తేవాలని బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలను వివరించి వారిలో చైతన్యం తేవడానికి కృషి చేస్తామని తెలిపారు.

సేవలు అభినందనీయం



రామారావు, సుజాత దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పోలీసు శాఖలో నలభై ఏళ్ల పాటు విశేష సేవలందించిన రాజమహేంద్రవరం సీసీఎస్ డీఎస్పీ చిలకా వెంకట రామారావు సేవలు అభినందనీయమని పలువురు అడిషనల్ ఎస్పీలు ప్రశంసించారు. గత నెల 31న పదవీ విరమణ పొందిన రామారావుకు మంగళవారం రాత్రి రాజమహేంద్రవరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పదవి విరమణ వేడుక జరిపారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఏబీఎం మురళీకృష్ణ, సీసీఎస్ అడిషనల్ ఎస్పీ ఆశ్మా పర్విన్, విజయవాడ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ తదితరులు రామారావు పోలీస్ శాఖలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రామారావు, సుజాత దంపతులను సత్కరించారు. అడిషనల్ ఎస్పీలుగా, డీఎస్పీలుగా ఉద్యోగ విరమణ చేసిన అరిటాకుల శ్రీనివాసరావు, పసుపులేటి రామారావు, ఆవుల సుబ్బారావు, వీరారెడ్డి, పీపీ గోపాలరావు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, తూర్పుగోదావరి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ తిలక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	థగ్‌లైఫ్
సూర్యమినీ	:	ఫైనల్ డెస్టినేషన్, మిషన్ ఇంపాజిబుల్
సూర్యప్యాలెస్	:	థగ్‌లైఫ్
స్వామి	:	ఏస్
శివజ్యోతి	:	హిట్-3
అనుశ్రీ	:	ఖలేజా
రాజా	:	ఖలేజా
ఊర్వశి	:	థగ్‌లైఫ్
మేనక	:	శుభం
రంభ	:	షష్టి పూర్తి
అప్సర	:	సింగిల్
కుమారి	:	వర్షం
అశోక	:	భైరవం
నామవరం		
వీఎస్ మహల్	:	థగ్‌లైఫ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	థగ్‌లైఫ్
కడియం		
వెంకటసూర్య	:	థగ్‌లైఫ్

పథకాలపై అవగాహన కల్పించాలి



నవధాన్యాల సాగు గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త నాయుడు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీఎస్‌టీ నాయుడు అన్నారు. రాజవోలు గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీఏఆర్, వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు డ్రోన్ వినియోగం, నవ ధాన్యాల సాగు, మట్టిలో ఉన్న పోషక విలువలను గుర్తించి తద్వారా ఎరువుల వినియోగం, పంటల ఎంపిక తదితర విషయాలపై శాస్త్రవేత్తలు వివరించారు. పీఎం కిసాన్, ఫసల్ బీమా, ఆర్కేవీవై, ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. డ్రోన్ల వినియోగం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు, పురుగు మందులు సమర్థవంతంగా పిచికారీ చేసే విధానాన్ని ఇఫ్కో, కోరమండల్ సాంకేతిక సిబ్బంది తెలిపారు. అనంతరం రాజవోలు గ్రామంలో నవధాన్యాలు సాగు చేసిన పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్లు సరళ, శిరీషా, వ్యవసాయ అధికారి భీమరాజు, ఆత్మ బీటీఎం రాజశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారులు పీటర్ ప్రభుదర్శన్, వేణు మాధవరావు, వీఏఏలు దుర్గబాబు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థలతో సమీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు సేవలందిస్తున్న 12 స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బందితో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠరెడ్డి సమీక్షించారు. స్థానిక షెల్టాన్ హోటల్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. హెచ్ఐవీ నిర్ధారణ జరిగిన రోజు నుంచే వారికి మందులు అందించాలని, భాగస్వామికి కూడా పరీక్షలు వెంటనే చేయించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల, ఎస్‌టీఐ డాక్టర్ ప్రసన్న, జాయింట్ డైరెక్టర్ బ్లడ్ ట్రాన్స్‌మిషన్ యూనిట్ డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్లకు శిక్షణ

కంబాలచెరువు: స్థానిక నన్నయ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జరుగుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ల శిక్షణ తరగతులను బుధవారం టీచర్స్ ట్రైనింగ్ రాష్ట్ర పరిశీలకుడు సురేష్‌కుమార్ పరిశీలించారు. ప్రభుత్వం విద్యాశాఖలో కొత్తగా అమలు చేస్తున్న అకాడమిక్ క్యాలెండర్, సెల్ఫ్ అసెస్‌మెంట్ బుక్‌లెట్, టీచర్ హ్యాండ్ బుక్, లీప్ యాప్ తదితర అంశాలపై శిక్షణ పొంది, ఈ నెల 8, 9, 10 తేదీలలో డివిజన్ వారీగా జరిగే ఉపాధ్యాయులకు వీరు ఇవ్వనున్నారు. డైట్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఏఎంఓ గౌరీశంకర్‌రావు, కోర్స్ కో ఆర్డినేటర్ దేవా అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు భారతరత్న ఇవ్వాలి



నగరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర




ధవళేశ్వరంలో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

ధవళేశ్వరం: సంగీత ప్రపంచానికి విశేష సేవలందించిన దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి భారతరత్న ఇవ్వాలని గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు కోరారు. రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని ఘంటసాల విగ్రహం సమీపంలో శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జీవీ రమణ మాట్లాడుతూ బాలు తెలుగు వారి ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. ఉపాధ్యక్షుడు గ్రంధి జగన్నాథం మాట్లాడుతూ పదహారు భాషల్లో ఏభై వేల పాటలు పాడిన ఏకైక గాయకుడు బాలు అని కొనియాడారు. కోశాధికారి సురపురెడ్డి తాతారావు, మున్సిపల్ డీఈ ఇ.మధర్వా ఆలీ, రాయుడు చంద్రశేఖర్, బర్రి సుబ్రహ్మణ్యం, పుసులూరి శేషు కుమార్, ముదెడ్ల రమేష్, గాదిరాజు రామరాజు, మడిచేర్ల మహాలక్ష్మి, దాసరి సాయిబాబు పాల్గొన్నారు.


బాలుతో అనుబంధం మరువలేనిది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో అనుబంధం మరువలేనిదని నట గాయకుడు జిత్ మోహన్‌మిత్ర అన్నారు. ఎస్పీ బాలు జయంతి సందర్భంగా జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై సంగీత విభావరి నిర్వహించారు. బాలు పాడిన చిత్రాల నుంచి గీతాలను ఎంపిక చేసుకుని సింగర్ వంకా బాలకృష్ణ పర్యవేక్షణలో గాయని గాయకులు పాటలు పాడి అలరించారు. జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గాయకుల్లో బాలు ఒకరన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బి.సీతారామారావును కళా సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. ముద్రగడ ఏసుబాబు, పోస్టల్ ప్రసాద్, జల్లి శివప్రసాద్ , వీపీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగా సాధన చేయాలి



యోగాంధ్రలో పాల్గొన్న జేసీ చిన్న రాముడు తదితరులు



యోగాసన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిత్య యోగా సాధనతో ఆరోగ్యకర సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.చిన్న రాముడు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపం గ్రాంట్ ట్రంక్ రోడ్డులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక ఉల్లాసం కలిగి తద్వారా ఎన్నో రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాయతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొంటారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో 5 లక్షల 40 వేల మంది యోగసాధకులు వారి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, గిరిజన ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాసనాల పోటీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో బుధవారం రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఇందులో యోగా టీచర్ సబ్బిశెట్టి లీలాసుందరి విద్యార్థులకు యోగాసన పోటీలు, సంగీతం టీచర్ కారుమూరి వీర రత్న కుమారి భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.